క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న మనోజ్‌శర్మ దంపతులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం ఈస్ట్‌కోస్ట్ రైల్వే భువనేశ్వర్ జనరల్ మేనేజర్ మనోజ్‌శర్మ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరం పూజ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు.

సబ్బవరం ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రామ్మోహనరావును అభినందిస్తున్న ఉద్యోగులు

సబ్బవరం: సబ్బవరం ఎంపీడీవోగా ఎస్. రామ్మోహనరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం రూరల్ నుండి వచ్చి విధుల్లో చేరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ ఏవో ఎస్. బాబూరావు నుండి ఆయన బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ సిబ్బందితో పాటు పలు గ్రామాల పంచాయితీ కార్యదర్శులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన బి. రమేష్ నాయుడు తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు.

9న డీ వార్మింగ్ డే



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 9న నిర్వహించే డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు కోరారు. రేసవానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బాల బాలికలకు అంగన్‌వాడీ, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజున స్కూళ్లకు హాజరుకాని పిల్లలకు 16న మాత్రలు అందించాలని సూచించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ డీ వార్మింగ్ మాత్రలు వేసుకోవడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు వుండవన్నారు. కార్యక్రమాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా నిర్వహించాలని సూచించారు. కన్సల్టెంట్ హీనా దీక్షిత్, శాంతి ప్రియ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ వార్షికోత్సవానికి ఏర్పాట్లు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ స్థాపించి మూడు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 4న వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు, వాకర్స్ ఫౌండేషన్ ట్రస్టు సభ్యుడు ఏహెచ్‌ఎస్ వెంకటరావు, అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం, 101-ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ పాల్గొంటారని చెప్పారు. వాకర్స్ వాయిస్ ఫిబ్రవరి నెల సంచిక ఆవిష్కరిస్తామన్నారు.



శిథిలమైన వాడచీపురుపల్లి-ఇస్సన్నపేట గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన రహదారి అభివృద్ధికి నోచుకోక ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. వాహన చోదకులు ఈ దారిలో ప్రయాణమంటే హడలిపోయేవారు. ఈ రహదారిని అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వాన్ని ప్రజలు అభ్యర్థించినా ఫలితం కనిపించలేదు. చేసేది లేక ప్రజలు శిథిల రహదారి గుండానే రాకపోకలు సాగించేవారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ దారికి మోక్షం దక్కింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏపీఆర్‌ఆర్ పథకం ద్వారా రూ.82.06 లక్షలు మంజూరు చేయడంతో వాడచీపురుపల్లి-ఇస్సన్నపేట మధ్య బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది.



నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చిన బీటీ రోడ్డు

నాడు శిథిలం.. నేడు సుందరం

- వాడచీపురుపల్లి-ఇస్సన్నపేట రహదారికి మోక్షం
- రూ.82.06 లక్షల ఏపీఆర్ఆర్ నిధులతో పునర్నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



వాడచీపురుపల్లి-ఇస్సన్నపేట రోడ్డు నిర్మాణంలో నిమగ్నమైన కార్మికులు

పరవాడ: వాడచీపురువల్లి-ఇస్సన్నపేట గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన రహదారి అధ్వానంగా మారిన నేపథ్యంలో ఇరు గ్రామాల ప్రజలు గత కొన్నేళ్లుగా అవస్థలు పడుతున్నారు. రహదారి అభివృద్ధి కోసం ప్రజలు గత ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా కనీస చర్యలు తీసుకోకపోవడంతో చేసేది లేక అధ్వాన్న రహదారితోనే అష్టకష్టాలు పడుతున్నారు. చీకటి పడితే గ్రామానికి వెళ్లాలంటే పడుతూ లేస్తూ వెళ్లాల్సి వచ్చేది. వర్షం పడితే చాలు రహదారిలో వాహనాలు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వర్షానికి రోడ్డంతా బురదమయంగా మారడంతో **వాహనాలు జారి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడేవారు. గోతుల మయంగా మారిన రహదారికి మరమ్మతులు చేపట్టాలని గత ప్రభుత్వంలో అధికారులకు వినతులు సమర్పించినా ఫలితం లేదని స్థానికులు అంటున్నారు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి సారించింది.** మారుమూల గ్రామాల ప్రజలకు సౌకర్యవంతమైన రహదారులు ఏర్పాటు చేయాలన్న దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక నిధులు కేటాయించారు. అందులో భాగంగా **వాడచీపురువల్లి** శివారు ఇస్సన్నపేట **గ్రామానికి తారు రోడ్డు** నిర్మాణం కోసం **ప్రభుత్వం ఏపీఆర్‌ఆర్ పథ**కంలో రూ.82.06 **లక్షలు మంజూరు చేసింది. మం**జూరైన నిధులతో **వాడచీపురుపల్లి-ఇస్సన్నపేట**కు గ్రామాల మధ్య **2.08 కిలోమీటర్ల మేర బీటీ** రోడ్డు నిర్మాణ పనులను **పెందుర్తి ఎమ్మెల్యే అ**న్నంరెడ్డి అదీప్‌రాజ్ **ఇటీవల ప్రారంభించారు. ని**ర్మాణం పూర్తి చేసు**కున్న బీటీ రోడ్డును త్వరలో** ప్రారంభించడానికి **ఏర్పాట్లు చేస్తున్నామని పంచా**యతీరాజ్ ప్రాజెక్టు **జేఈ పైడి వెంకట నాయుడు** తెలిపారు.

మా కష్టాలు తీరాయి..



ఇస్సన్నపేట గ్రామానికి తారు రోడ్డు నిర్మాణంతో ప్రజల కష్టాలు తీరాయి. రోడ్డు అభివృద్ధికి గత ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోలేదు. ఫలితంగా ప్రజలు అష్టకష్టాలు ఎదుర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో మా గ్రామానికి తారు రోడ్డు మంజూరైనందుకు ప్రజల తరఫున సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

– కూండ్రపు ఉమ, ఇస్సన్నపేట

బదిలీ అయిన తహసీల్దార్‌కు సత్కారం



తహసీల్దార్ సత్యనారాయణను సత్కరిస్తున్న ఉద్యోగులు

సబ్బవరం: సబ్బవరం తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీ అయిన బి. సత్యనారాయణను కార్యాలయ సిబ్బందితో పాటు వీఆర్వోలు గురువారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సత్యనారాయణ బదిలీ అయ్యారు. ఆయనకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది సత్కరించారు. జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, మండల సర్వేయర్ కర్రి శ్రీనివాసరావు, రెవన్యూ ఇన్‌స్పెక్టర్ వీరయ్య, వీఆర్వో పూడి శేషు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విద్య స్కూల్‌లో విద్యార్థిపై టీచర్ దాడి

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పరిధి మధురవాడలోని శ్రీ విద్య స్కూల్‌లో ఓ టీచర్ విద్యార్థి తలపై రక్తం వచ్చేలా కొట్టారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం బయటకు పొక్కడంతో సదరు విద్యార్థి తల్లిదండ్రులపై స్కూల్ యాజమాన్యం ఒత్తిడి తీసుకొచ్చి రాజీ చేసినట్టు తెలిసింది. ఈ విషయం విద్యాశాఖ అధికారుల దృష్టికి కూడా వెళ్లింది. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా క్రమశిక్షణ, ఎక్కువ మార్కుల పేరుతో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్న ఘటనలు ఇటీవల వెలుగు చూస్తున్నాయి.

కో-ఆపరేటివ్ సొసైటీల పనితీరు పరిశీలన



జాగృతి సొసైటీలో బర్డ్స్ లక్నో బృందం సభ్యులు

సబ్బవరం: సబ్బవరం మండల కేంద్రంగా పని చేస్తున్న జాగృతి సొసైటీతో పాటు కో ఆపరేటివ్ సొసైటీని విశాఖపట్నంలోని బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (బర్డ్స్) లక్నో బృందం గురువారం సందర్శించింది. నాబార్డు డీజీఎంలు, బర్డ్ లక్నో ఫ్యాకల్టీ సంజయ్ రామన్, సంతోష్ దూబే ఆధ్వర్యంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 30 మంది బ్యాంకర్ల బృంద సభ్యులు సబ్బవరంలో పర్యటించారు. వీరంతా జాగృతి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పడిన రైతు ఉత్పత్తిదారుల సంఘం పనితీరు, కో ఆపరేటివ్ బ్యాంక్ ఆర్థిక పురోభివృద్ధిని అధ్యయనం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, హర్యానా, బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల డీసీసీబీ, రిజర్వ్ బ్యాంక్‌తో పాటు ఇతర వాణిజ్య బ్యాంకులలో పని చేస్తున్న బ్యాంకు అధికారుల బృందం సభ్యులు పాల్గొన్నారు. బ్యాంకులు ఏ విధంగా తోడ్పాటును అందిస్తున్నాయో సంఘం సభ్యులను అడిగి తెలుసుకున్నారు. 3 జిల్లాల్లో అభివృద్ధి సాధించిన రైతుల పనితీరును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డిప్యూటీ జనరల్ మేనేజర్ అశోక్, కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ కాపు శెట్టి శేషుబాబు, వైస్ ఛైర్మన్ పల్ల కృష్ణ, సీఈవో గొంప రమణ, జాగృతి ఎండీ కె. సుజాత, సీఈవో మౌక్తిక తదితరులు పాల్గొన్నారు.

జోన్-8 బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామరాజు



జోన్-8 బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

సింహాచలం: జీవీఎంసీ జోన్-8 బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. 93వ వార్డు బాలాజీనగర్‌లోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిల్డర్లు అంతా కలిసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.వి.రామరాజు, ఉపాధ్యక్షులుగా పి.హరిప్రసాదరావు, ఎన్.శ్రీనివాసు, జనరల్ సెక్రటరీగా ఎల్.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా ఎ.సతీష్, ట్రెజరర్‌గా ఎల్.రమణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా డి.వి.రమణ, డి.రాజశేఖర్, బి.చిన్నారావు, ఎం.ఆదిత్యశ్రీకర్, ఎక్స్ అఫీషియో మెంబర్స్‌గా టి.అజిత్‌కుమార్, జి.రమణయ్, కె.ఎస్.జి.చౌదరి ఎన్నికయ్యారు.

దేశ ఐక్యతకు జాతీయ భాష దోహదం

డీఆర్‌డీవో శాస్త్రవేత్త, డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీనివాసరావు



డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందిస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

గోపాలపట్నం: సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధిలో రాజభాష హిందీ ఎంతగానో దోహదపడుతోందని డిఫెన్స్ టెక్నాలజీ రంగ నిపుణుడు, డీఆర్‌డీవో విశిష్ట శాస్త్రవేత్త డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. డీఆర్‌డీవో హైదరాబాద్ క్లస్టర్ పరిధి అఖిల భారత సంయుక్త రాజభాషా సైంటిఫిక్ అండ్ టెక్నాలజీ రెండు రోజుల సెమినార్ ఎన్ఎస్‌టీఎల్‌లో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభూమికి, జాతీయ భాషకు సేవ చేయాలని కోరారు. దేశం ఐక్యంగా వుండాలంటే మాధ్యమంగా హిందీభాష అవసరమన్నారు. శాస్త్రీయ ఆలోచనలు, సాంకేతికతను ప్రచారం చేయడంలో జాతీయ భాష దోహదపడుతుందన్నారు. ఐఎన్ఎస్ చీఫ్ జనరల్ మేనేజర్ పిజు నవేరా మాట్లాడుతూ దేశం సరిహద్దులు సురక్షితంగా వుంచడంలో డీఆర్‌డీవో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఇందులో సాంకేతికత పోషించే పాత్రను వివరించారు. హిందీ భాషలో ఈ సెమినార్ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. డీఆర్‌డీవో హెడ్ క్వార్టర్స్ డైరెక్టర్ (రాజభాష) డాక్టర్ రవీంద్ర సింగ్ మాట్లాడుతూ శాస్త్రీయ సమాజంలో హిందీ భాషను ప్రోత్సహించడం, అందుకు చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ భారత నౌకాదళం కోసం అత్యాధునిక ఆయుధాలు అభివృద్ధి చేయడంలో ఎన్ఎస్‌టీఎల్ ప్రముఖ పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఇక్కడ రూపుదిద్దుకున్న పలు ఆయుధాల సాంకేతికతను వివరించారు. ఈ సందర్భంగా సెమినార్‌లో పాల్గొన్న ప్రతినిధులు తమ ఆలోచనలు ఆవిష్కరించారు. అనంతరం సావనీర్ ఆవిష్కరించారు. ఆహుతులకు డైరెక్టర్ అబ్రహం వర్గీస్ జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో సెమినార్ ఛైర్మన్ జీసీ కేదార్‌నాథ్, కో ఆర్డినేటర్ వివేక్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను గుర్తించే రాజకీయ పార్టీలకే మద్దతు



ఐక్యత చాటుతున్న బీసీ సంఘం నాయకులు

డాబాగార్డెన్స్: బీసీలను గుర్తించే రాజకీయ పార్టీలకే తమ మద్దతు ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు తెలిపారు. నగరంలోని బీసీ సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఎన్నికల సమయంలో బీసీలను వాడుకుంటున్న ఆయా రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్పేలా, రాజ్యాధికారమే లక్ష్యంగా అన్ని బీసీ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి, రాబోయే ఎన్నికల్లో సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జనాభాలో 50 శాతం పైగా ఉన్న బీసీలు, దళిత, ఆదివాసీ, మైనార్టీ ప్రజలను నమ్ముకుంటే బీసీ నాయకులకు ఆత్మగౌరవం, రాజ్యాధికారం, సామాజిక న్యాయం లభిస్తుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు ఏ రాజకీయ పార్టీ సముచిత స్థానం కల్పించి పదవులు కేటాయిస్తుందో వారికే మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర పొలిటికల్ జేఏసీ కన్వీనర్ గొర్లె శ్రీనివాసనాయుడు, కర్రి ధనుంజయనాయుడు, పల్ల రమణ, కామన వెంకట సుబ్బారావు, ప్రసాద్, పల్లి శ్రీనివాసనాయుడు, సంసద్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాలభైరవ షష్టి

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో శుక్రవారం కాలభైరవ షష్టి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రాజాస్వామి తెలిపారు. సాయంత్రం కాలభైరవ స్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు చేస్తామన్నారు. స్వామికి గారెలు దండలు వేసి ప్రత్యేకంగా అలంకరిస్తామన్నారు.

సింహగిరిపై ఇంగ్లండ్ దేశస్తుల సందడి



సింహగిరిపై వేచి ఉన్న ఇంగ్లండ్ దేశస్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం ఇంగ్లండ్ దేశస్తులు దర్శించుకున్నారు. విశాఖలో శుక్రవారం ప్రారంభం కానున్న భారత్, ఇంగ్లండ్ రెండో టెస్టు మ్యాచ్‌ని తిలకించేందుకు వీరంతా విశాఖ వచ్చారు. ఇందులో భాగంగా సింహగిరికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. సింహగిరి అందాలను తిలకించారు. ఆలయ రాజగోపురం వద్ద ఉన్న కళా వేదికపై జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.

16వ పోలీస్ బెటాలియన్‌లో భారీగా బదిలీలు



బదిలీ అయిన అధికారులతో కమాండెంట్ గౌతమీ సాలి తదితరులు

పీఎం పాలెం: బక్కన్నపాలెం ఏపీఎస్పీ పోలీస్ శిక్షణ కేంద్రంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 25 మంది అధికారులు బదిలీ అయ్యారు. బెటాలియన్ అదనపు కమాండెంట్ పి.శ్యామ్యూల్, పలువురు అసిస్టెంట్ కమాండెట్లు రాష్ట్రంలోని వివిధ ఏపీఎస్పీ బెటాలియన్లకు బదిలీ అయ్యారు. వీరందరినీ స్థానిక 16వ బెటాలియన్ కమాండెంట్ ఎంఎస్ గౌతమీ సాలి గురువారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.ఎలియా సాగర్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



సర్టిఫికెట్లతో ఎన్ఎంసీ హైస్కూల్ విద్యార్థులు

సీతమ్మధార: విశాలాక్షినగర్‌లోని బీవీకే హైస్కూల్‌లో గత నెల 28న యూత్ ఫర్ సేవా సంస్థ 'చిగురు' నిర్వహించిన క్రీడా పోటీల్లో సీతమ్మధార పీ అండ్ టీ కాలనీ ఎన్ఎంసీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. 9వ తరగతి విద్యార్థిని హెచ్.సౌజన్య క్విజ్, ఏడో తరగతి విద్యార్థినులు బి.పావని, పి.లిఖిత రన్నింగ్, 8వ తరగతి విద్యార్థి కె.మణికంత రన్నింగ్ పోటీల్లో మెరిశారు. ఈ నలుగురికి గురువారం సంస్థ సర్టిఫికెట్లు అందజేశారు.

వాల్తేర్ డివిజన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



లోకోషెడ్‌లో మహిళా సిబ్బందితో మాట్లాడుతున్న జీఎం మనోజ్ శర్మ

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ గురువారం రెండో రోజు వాల్తేర్ డివిజన్ పరిధిలోని ఎలక్ట్రికల్ లోకోషెడ్‌లో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌తో కలిసి పర్యటించారు. అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. మహిళా సిబ్బంది, అధికారులు, సిబ్బందితో జీఎం ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎలక్ట్రికల్ లోకోషెడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రో మేగ్నటిక్ క్రాక్ డిటెక్షన్ యూనిట్, ఎయిర్‌డ్రైయిర్ టెస్ట్ బెంచ్, లోకో బాడీ వాషింగ్, క్లీనింగ్ యూనిట్‌లను ప్రారంభించారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో ఎంపికైన అమృత్ స్టేషన్స్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో డివిజన్ పరిధిలో జరుగుతున్న డబ్లింగ్, ట్రిబ్లింగ్ పనులపై జీఎం సమీక్షించారు.

సింహాచలేశుడికి విశేషంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు రంగనాథ్, చక్రవర్తి, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

అప్పన్న స్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

ఆకట్టుకున్న కెమికల్ ఎక్స్‌పో



ఫార్మా ల్యాబ్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న బీయూ స్పెషాలిటీ ప్రొడక్ట్ ప్రెసిడెంట్ అనంత్ బర్బాదికర్

పరవాడ: విశాఖ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ఏర్పాటు చేసిన వైజాగ్ ఫార్మా ల్యాబ్ కెమికల్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను బీయూ స్పెషాలిటీ ప్రొడక్ట్స్ ప్రెసిడెంట్ అనంత్ బర్బాదికర్ గురువారం ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో జాతీయ, అంతర్జాతీయ ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు స్టాళ్లను ఏర్పాటు చేసి తమ తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. ఈ స్టాళ్లు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బర్బాదికర్ మాట్లాడుతూ ఇక్కడ నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో 125 జాతీయ, అంతర్జాతీయ ఔషధ పరిశ్రమల స్టాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఎగ్జిబిషన్ మూడు రోజుల పాటు జరుగుతుందని, ఈ అవకాశాన్ని ఫార్మా పరిశ్రమలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా బర్బాదికర్‌కు ఫార్మా పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ శ్రావణ్ షిప్పింగ్ ఛైర్మన్ జి.సాంబశివరావు, లారస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు, లారస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వి.లక్ష్మణరావు, సియాంక స్యూటికల్స్ డైరెక్టర్, ముచ్చువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్(ఎంపఎస్ఆర్ఎం) కార్యదర్శి జెట్టి సుబ్బారావు, వెర్దంతి లైఫ్ సైన్సెస్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఎం.శివరామప్రసాద్, ఎగ్జిబిషన్ డైరెక్టర్ అజిత్‌కుమార్ శుక్లా పాల్గొన్నారు.





ఎక్స్‌పోలో వివిధ పరిశ్రమల యాజమాన్యాలు ఏర్పాటు చేసిన స్టాళ్లు

జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ జాతీయ సేవా పథకం వలంటీర్లు ఎంపికయ్యారు. ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు పంజాబ్‌లోని పటియాలాలో చిత్కర విశ్వవిద్యాలయంలో జరిగే ఈ శిబిరానికి ఏయూకు చెందిన 10 మంది విద్యార్థులు, ఓ ప్రోగ్రాం అధికారి హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన వలంటీర్లను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం అభినందించారు. జాతీయ సేవా పథకం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఉపయుక్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని వీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.